క్లుప్తంగా

ఆదివాసీ గ్రామంలో బోరు ఏర్పాటు


బోరు ఏర్పాటును పర్యవేక్షిస్తున్న సీఐ, ఎస్సై

దుమ్ముగూడెం: మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన మానుగట్టలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు పోలీసుల దృష్టికి తీసుకురావడంతో అధికారుల ఆదేశాల మేరకు సీఐ అశోక్ తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గణేష్, పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు..


నీరు సరఫరా చేయిస్తున్న ఎంపీఓ లక్ష్మయ్య

ములకలపల్లి: మూకమామిడి జీపీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామం ఏనుగు అప్పయ్య నగర్ వాసులకు ట్యాంకర్లతో తాగునీటిని అందజేశారు. గుత్తికోయలు తాగునీటికి వాగుల్లోని చెలమలను ఆశ్రయిస్తున్నట్టు ఎంపీఓ లక్ష్మయ్య దృష్టికిరాగా సిబ్బందితో కలసి గ్రామాన్ని సందర్శించి ప్రత్యేకంగా ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. కాగా బోరు, మోటారు ఏర్పాటు చేసి, శాశ్వత పరిష్కారం చూపాలను గ్రామస్తులు కోరారు.

నిర్వాహకులకు కౌన్సెలింగ్

దమ్మపేట: తిరునాళ్ల ఉత్సవాల్లో అనుమతులు లేకుండా మైక్‌ను ఉపయోగించడమే గాక రికార్డింగ్ డాన్స్‌లు నిర్వహించిన నిర్వాహకులకు, పోలీసులు కౌన్సెలింగ్ గురువారం రాత్రి నిర్వహించారు. మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో రామనవమి పర్వదినం సందర్భంగా ఐదు రోజుల పాటు తిరునాళ్ల ఉత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాల్లో అనుమతులు లేకుండా మైక్‌ను ఉపయోగిస్తూ, స్టేజీపై డాన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై సాయికిషోర్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అనుమతులు లేని ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించకూడదని నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి: మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌–కో ఏఈ లక్ష్మీనర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏజెన్సీలో బీడీ పరిశ్రమ నెలకొల్పాలి

బూర్గంపాడు: తునికాకు విరివిగా లభ్యమయ్యే ఏజెన్సీలో బీడీ పరిశ్రమను నెలకొల్పి తునికాకు కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.ప్రసన్నచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. భద్రాచలం, పినపాక, ఇల్లెందు నియోజకవర్గాలలో నాణ్యమైన తునికాకు లభ్యమవుతున్నప్పటికీ ఈ ప్రాంతంలో బీడీ పరిశ్రమను ఏర్పాటు చేయటంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తునికాకు కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఏజెన్సీలో బీడీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరారు.

22న శివాలయ వార్షికోత్సవం

ములకలపల్లి: ములకలపల్లి శివారులోని ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవాన్ని 22న వైభవోపేతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ చైర్మన్ నరాటి ప్రసాద్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సూపర్‌ఫాస్ట్ రైలు సకాలంలో వచ్చేలా చూడాలి

అశ్వాపురం: సికింద్రాబాద్ నుంచి మణుగూరు వచ్చే సూపర్ ఫాస్ట్ రైలు సకాలంలో వచ్చేలా చూడాలని భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం నాయకుడు పాడ్య కేశవరావు అన్నారు. శుక్రవారం గౌతమీనగర్ కాలనీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైలు సికింద్రాబాద్‌లో అర్ధరాత్రి దాటాక బయలుదేరుతూ కొత్తగూడెం వచ్చే వరకు ఉదయం 8, మణుగూరు వచ్చే వరకు 10 అవుతుండటంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఖరీఫ్‌కైనా ఎత్తిపోసేనా..?

మూలనపడిన కిన్నెరసాని ఎత్తిపోతల పథకం

- ప్రారంభించిన రెండేళ్ల పాటు అందిన సాగునీరు..
- కొట్టుకుపోయిన తూములు, పైపులు
- సాగునీటికి ఎదురుచూస్తున్న రైతులు



నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం

గుండాల: ఏజెన్సీ ప్రాంత రైతులు సాగు నీటి కోసం వాగుల్లో మోటార్లు పెట్టుకుని సాగు చేసే వారు. చెరువులు, వాగులు అడుగంటినా చివరి తడి కోసం పడరాని పాట్లు పడాల్సిందే. ఖరీఫ్ పంటలకు సైతం వరుణుడు ముఖం చాటిస్తే రైతులు పెట్టిన పెట్టుబడులు మట్టిలో కలవాల్సిందే. ఉమ్మడి గుండాల మండలం నుంచి వాగుల ద్వారా నీరు వృథాగా పోకుండా కిన్నెరసానిపై ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. కానీ రెండేళ్ల పాటు సాగునీరు అందించిన ఆ పథకం అధిక వర్షాలకు ఉప్పొంగిన వాగులతో నీట మునిగి నేడు మూలనపడింది. దీంతో ఆయకట్టు రైతులు మళ్లీ మొదటి దశకు చేరుకున్నారు. ఈ పరిస్థితి ఆళ్లపల్లి మండలంలో ఉండగా ఈ ఖరీఫ్‌కైనా ఆ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని రైతులు వేడుకుంటున్నారు.

చెక్ డ్యాం నిర్మాణాలకు నిధులు..

అదే కిన్నెరసానిపై రెండు చోట్ల చెక్‌డ్యాంల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఐడీసీ పథకం 2021లో ఇరిగేషన్‌లో విలీనమైన తర్వాత రూ.8 కోట్ల వ్యయంతో మైలారం వద్ద, అనంతోగు వద్ద రూ.9 కోట్లతో మరో చెక్ డ్యాం నిర్మాణాలకు నిధులు మంజూరుకాగా పనులకు శంకుస్థాపనలూ అయ్యాయి. అంతేకాకుండా ఎత్తిపోతల పథకం పునర్మించేందుకు రిపేరు కోసం రూ.27 లక్షలతో ప్రణాళికలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ నిధులు ఎప్పుడు మంజూరు అవుతాయో ఎప్పుడు ప్రారంభిస్తారోనని రైతులు వాపోతున్నారు.

కిన్నెరసానిపై కరకట్ట నిర్మించాల్సిందే..

అధిక వర్షాలతో కిన్నెరసాని ఉధృతంగా ప్రవహించడంతో వాగులపై ఎత్తిపోతలు, మంచినీటి పథకాలకు సంబంధించి మోటార్లు కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాలు నిర్మించే చోట కరకట్టలు ఏర్పాటు చేస్తేనే వరదకు ముప్పు రాకుండా ఉంటుందని స్థానిక రైతులు అంటున్నారు.

బీళ్లుగా పంటలు..

రెండేళ్లుగా ఎత్తిపోతల పథకం పనిచేయకపోవడంతో ఆయకట్ట భూములు బీళ్లుగా మారుతున్నాయి. ఆయా చెరువుల కింద సాగుచేసే వరికి చివరి దశలో నీరు ఇంకిపోతుండడంతో ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకంతో పాటు, చెక్ డ్యాముల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తే వరి పంటలతో పాటు, అన్ని రకాల పంటలు పండించే అవకాశాలున్నాయని, అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

కొట్టుకుపోయిన పైపులు..


పాడైపోయిన తూము

ఆళ్లపల్లి మండలంలోని మైలారం వద్ద కిన్నెరసానిపై వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందించేలా ఐడీసీ కింద రూ. 10.91 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారు. 2019లో ఆ పథకాన్ని ప్రారంభించగా రెండేళ్ల పాటు సాగునీరు అందింది. ఆ తర్వాత కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి దీంతో పైపులు కొట్టుకుపోగా సంపులోకి నీరు చేరి మోటార్లు సైతం పాడయ్యాయి. ఇప్పుడు ఆ ఎత్తిపోతల పథకం నిరుపయోగంగానే ఉంది


వాగు ఉధృతికి కొట్టుకుపోయిన పైపులు

పథకాన్ని పునరుద్ధరించాలి..



కిన్నెరసాని ఉధృతికి ఆ పథకం నీట మునిగి పాడయిపోయింది. దీంతో రెండేళ్లుగా సాగు నీరు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించి తమను ఆదుకోవాలి.

– కుంజా వెంకటేశ్వర్లు, రైతు

కరకట్ట నిర్మించాలి..



కిన్నెరసానిపై ఎత్తిపోతల పథకం ఉన్న చోట కరకట్ట నిర్మించాలి. లేకుంటే మళ్లీ వచ్చే వాగుల ఉధృతికి కొట్టుకుపోతాయి. దీంతో తాము ఎప్పటిలాగే సాగునీటి కోసం పడిగాపులు పడాల్సిందే.

– పూకె శ్రీను, తిర్లాపురం, రైతు

ప్రణాళికలు పంపించాం

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించాం, వాగు ఉధృతికి మోటార్లు పాడయ్యాయి. పైపులైను కొట్టుకుపోయింది. రిపేరు కోసం రూ. 27లక్షలకు ప్రణాళికలు పంపించాం. ఆ నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఐదు చెక్ డ్యాంలకు నిధులు మంజూరయ్యాయి.

– ఇరిగేషన్ ఏఈ, దుర్గా ప్రసాద్

ఐటీసీ పీఎస్‌పీడీని విస్తరింపజేయాలి


ప్రణవ్‌శర్మను సన్మానిస్తున్న శంకర్‌రెడ్డి

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీని మరింతగా విస్తరించి యువతకు మెరుగైన జీవనోపాధులు కల్పించాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి కోరారు. ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రణవ్‌శర్మను శుక్రవారం ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రణవ్‌శర్మ నేతృత్వంలో ఐటీసీ పీఎస్‌పీడీ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం సరిహద్దు ఏపీలోని ఎటపాక మండలం కన్నాయిగూడెం ఎంపీటీసీ వర్సా బాలకృష్ణను దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం మండల కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. నిందితులు ఎంతటి వారైన శిక్ష పడే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని కమిటీ కోరింది.

అశ్వాపురం: భద్రాచలం సమీపంలో కన్నాయిగూడెంలో ఎంపీటీసీ బాలకృష్ణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని మండల ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు అన్నారు. అశ్వాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. బాలకృష్ణపై జరిగిన దాడి యావత్ ఆదివాసీ ప్రజల రాజకీయ ఎదుగుదలపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామన్నారు.

దుమ్ముగూడెం: ఎంపీటీసీ వర్ష బాలకృష్ణను హత్య చేసిన వారిని శిక్షించాలని ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి కొర్సా నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

భద్రాచలంఅర్బన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన పట్టణంలోని కూనవరం రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ మేరకు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, అనంతరం యజమానిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై విజయలక్ష్మీ తెలిపారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ మృతికి సంతాపం

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం మండల విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుంజి చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందగా పలువురు శుక్రవారం సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఏఈ మోహన్‌రెడ్డి, ఎస్ఈ రాజేష్, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

మణుగూరు రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచినట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ... కాస్మోటిక్, డ్రోన్, సోలార్, సెల్ టెక్నిషియన్స్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కోర్సులకు ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సింగరేణి, మాజీ సింగరేణి ఉద్యోగులతో పాటు ప్రాజెక్ట్ ప్రజావిత, పునరావాస, పరిసర గ్రామాల నిరుద్యోగులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసి సంబంధిత జీరాక్స్‌లతో పాటు సర్టిఫికెట్లను జతచేసి ఏరియా ఎంవీటీసీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న పూజారులు

చండ్రుగొండ : మండలంలోని గుర్రాయిగూడెం గ్రామంలో శ్రీకోదండ రామాలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ప్రధాన పూజారి వీవీఆర్‌కే మూర్తి ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పూజా కార్యక్రమం సాగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

దాడి కుట్ర సరికాదు..

దమ్మపేట: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడి చేయాలని పన్నాగాలు చేయడం సరికాదని మండల యాదవ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుమ్మలపై దాడికి పాల్పడాలనే తలంపుతో వ్యూహాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంఘం మండలాధ్యక్షుడు జోనేబోయిన శ్రీనివాసరావు, ఎర్రగొర్ల రాధకృష్ణ, చక్కిరాల మల్లేశ్వరరావు, నూనె శ్రీనివాసరావు పాల్గొన్నారు

గుండాల: మంత్రి తుమ్మల నాగేశ్వరావుపై దాడికి యత్నించిన సంఘటనపై కాంగ్రెస్ ఆళ్లపల్లి మండల అధ్యక్షులు పాయం రాంనర్సయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్ అతహార్‌లు తీవ్రంగా ఖండించారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకన్న, శ్రీనివాస్, నగేష్, ముత్తిలింగం, సుధాకర్ ఉన్నారు.

వితరణల వెల్లువ..

ఆర్థికసాయం

భద్రాచలంఅర్బన్: వసూద ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న భద్రాచలం పట్టణానికి చెందిన రెండు కుటుంబాలకు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో రెండు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఏఎస్పీ పరితోష్ పంకజ్ అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ పంకజ్ వసూధ ఫౌండేషన్ సంస్థ, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు, ఎస్‌ఏ.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: ఆర్థికసాయం అందజేస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

నిత్యావసర సరుకులు..

చర్ల: మండలంలోని లింగాపురంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన కాగా బాధిత కుటుంబానికి సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో బియ్యం, సరుకులు, కూరగాయలు, బట్టలు, వంట సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


చర్ల: సరుకులు, దుస్తులు అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు కూలర్లు..

చర్ల రూరల్: వనవాసీ కల్యాణ పరిషత్‌లోని వనవాసీ విద్యానిలయం విద్యార్థులకు ఆర్కె సీడ్స్ అధినేత దేవభక్తుని రామకృష్ణ శుక్రవారం రెండు కూలర్లు వితరణగా అందించారు. తన తండ్రి దేవభక్తుని సాంబశివరావు వర్ధంతి సందర్భంగా రామకృష్ణ, అతని సోదరి రాధిక విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంతీయ సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కోరం సూర్యనారాయణ, జవ్వాది మురళీకృష్ణ, గొంది శోభన్, గోగికార్ రామ్ లక్ష్మణ్, సుతారి రుషికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై శ్రీరాముల శ్రీను పరిశీలించారు. అశ్వారావుపేటలోని మేజర్ గ్రామ పంచాయతీ, ఐకేపీ కార్యాలయం, ఎమ్మార్సీ కార్యాలయం, మండలంలోని పేరాయిగూడెం, రామన్నగూడెం, పండువారిగూడెం, పేరాయిగూడెం తోపాటు మరికొన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల వద్ద మరుగుదొడ్లు, దివ్యాగులకు ర్యాంప్‌లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ ముత్తినేని సుజాత

అశ్వాపురం: మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సుజాత అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు సభ్యులకు చదివి వినిపించారు. మండుతున్న ఎండల దృష్టా తాగు నీటి అంశం పై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, ఎంపీడీఓ వరప్రసాద్, సీడీపీఓలు ప్రమీల, రేవతి, ఆయుర్వేద వైద్యాధికారి అరుణ, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


భద్రాచలంటౌన్: ఎమ్మెల్యే తెల్లం ఆధ్వర్యంలో సభకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు



అశ్వాపురం నుంచి వెళ్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: మహబూబాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన జనజాతర సభకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మానుకోటకు శుక్రవారం వెళ్లారు. వెళ్లిన వారిలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, నాగసతీష్, నరేష్, రమాకాంత్, కృష్ణమూర్తి, రమేష్, వెంకటేష్, మహమ్మద్ జిందా, రాజీవ్, చిట్టిబాబు, రాము, ప్రసన్న, రామకృష్ణ, రాజశేఖర్, కృష్ణారెడ్డి, నవాబ్, నాగేంద్ర, విజయ్, భాను పాల్గొన్నారు.

అశ్వాపురం: మండలం నుంచి జనజాతర సభకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, సదర్‌లాల్, ఓరుగంటి రమేష్, బచ్చు వెంకటరమణ, చెంచల రాము, చెన్నయ్య, గొల్లపల్లి నరేష్, నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే సంక్షేమం


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మణుగూరు రూరల్ : పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిందని బీజేపీ నాయకులు అన్నారు. పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం మండల పరిధిలోని కొండాయిగూడెం గ్రామంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. దాచేపల్లి అశోక్, గణపారపు వెంకటేశ్వర్లు, గంటా హరిప్రసాద్, దాచేపల్లి సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

ములకలపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని, ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ మాజీ మండలాధ్యక్షుడు పాలకుర్తి ప్రసాద్ కోరారు. మండలపరిధిలోని పొగళ్లపల్లిశివారులో శుక్రవారం ఉపాధి కూలీలను కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పి, బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు.


ఓట్లు అభ్యర్థిస్తున్న పాలకుర్తి ప్రసాద్

మణుగూరు- బీహెచ్‌ఈఎల్‌కు డీలక్స్ సర్వీస్

మణుగూరు రూరల్ : మణుగూరు నుంచి వయా ఏటూరునాగారం మీదుగా హైద్రాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు డీలక్స్ బస్‌సర్వీస్ నడుపుతున్నట్టు ఆర్టీసీ మణుగూరు డిపో మేనేజర్ టి.స్వామి శుక్రవారం తెలిపారు. బీహెచ్‌ఈఎల్‌కు మణుగూరు నుంచి రాత్రి 7.25కు సురక్షా బస్టాండ్ నుంచి బయలుదేరుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి


చర్ల: ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు పనుల ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఏపీఓ సాంబశివరావుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు చర్లలోని బస్టాండ్ సెంటర్ నుంచి ప్రదర్శన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. పార్టీ చర్ల, దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి ముసలి సతీష్, నాయకులు నరసింహ, గగనం లక్ష్మి, వానరాసి సారవ్వ, సమ్మక్క, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం

ములకలపల్లి: మండలపరిధిలోని మంగలిగుట్ట గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి అభిషేకం, సుదర్శన యాగం అనంతరం అర్చకులు భార్గవాచార్యుల నేతృత్వంలో కల్యాణక్రతువు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాయల సమ్మక్క కేథారేశ్వరరావు దంపతులతోపాటు రేపాక ప్రసాదరావు, పద్దం దీపక్, పడిగ ప్రసాద్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని జరిపించారు. భారీగా భక్తులు హాజరుకాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ములకలపల్లి శివాలయ కమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్, వీరగోపాల్, డాక్టర్ సుధాకర్ రావు, సాంబశివరావు, ఎన్‌పీ నాయుడు, రంజాన్, జగన్, డాక్టర్ కేపీ.సత్యనారాయణరాజు, గొడ్ల రాజు, నర్సింహారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


దుమ్ముగూడెం: విగ్రహ ప్రతిష్ఠలో అర్చకులు


దమ్మపేట: అన్నదానంలో భక్తులు

దుమ్ముగూడెం: పర్ణశాల దివ్యక్షేత్రంలో చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం త్రయాహ్నిక దీక్షతో అంగరంగ వైభవోపేతంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష ద్రవ్యాలతోటి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్ కుమార్, ప్రత్యేక అధికారి అనిల్ కుమార్, అర్చకులు పాడిచేటి రామభద్రాచార్యులు, సీత రామానుజాచార్యులు, వెంకటాచార్యులు, నరసింహచార్యులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని అర్బన్ కాలనీలో శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు సూరిశాస్త్రి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.